క్లుప్తంగా

ఘనంగా రావులమ్మ వారి తీర్థం


రావులమ్మ వారు

అంబాజీపేట: కె.పెద పూడిలో వేంచేసిన రాజేశ్వరి రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అమ్మవారి ఉయ్యాల సేవలో గ్రామ ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం రాత్రి అమ్మవారి పూజఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తూ జాతర నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

రేపు తాటమ్మ వారి తీర్థం



పి.గన్నవరం: గ్రామంలో వేంచేసిన తాటమ్మ వారి తీర్థ మహోత్సవాన్ని ఈనెల 6న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ట్రస్టీ సుంకర రాంబాబు తెలిపారు. తీర్థ మహోత్సవాల్లో భాగంగా గత నెల 18న అమ్మవారిని నిలబెట్టి, ప్రతి రోజూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి చిన జాగరం జరిగింది. బుధవారం రాత్రి పెద జాగరం నిర్వహిస్తారు. గురువారం జరిగే తీర్థ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అభయాంజనేయునికి మామిడిపండ్లతో అర్చన


మామిడిపండ్లతో అభయాంజనేయునికి పూజలు

మామిడికుదురు: మామిడికుదురులో కొలువుదీరిన అభయాంజనేయస్వామికి మంగళవారం మామిడిపండ్లతో అర్చన చేశారు. వైశాఖ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. చెరకురసంతో పాటు పలు ద్రవ్యాలతో పూజలు జరిపించారు. అనంతరం మామిడిపండ్లను స్వామి వారికి సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ పూజలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ అభినందనీయం


తైక్వాండో ప్రదర్శన చేసిన చిన్నారులు

రాజోలు: చిన్నారుల కోసం తైక్వాండో, వెస్ట్రన్, క్లాసికల్ డ్యాన్స్ వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ పారిశ్రామిక వేత్త కేఎస్ఎన్ రాజు అన్నారు. తాటిపాకలో శ్రీరామ్ డ్యాన్స్ అకాడమీ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకుని చిన్నారులు ప్రదర్శించిన తైక్వాండో, వెస్ట్రన్, కూచిపూడి నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాలలను తెరిచే వరకు చిన్నారులు ఆసక్తి చూపే రంగంపై వారికి శిక్షణ ఇస్తున్న డాన్స్ మాస్టర్లు ప్రసాద్, సాయికుమార్, తైక్వాండో కోచ్ మణికుమార్‌ను చిన్నారుల తల్లిదండ్రులు అభినందించారు.

ఎన్డీఏ కూటమి విజయంపై హర్షం


మాలే శ్రీనివాస నగేష్

సఖినేటిపల్లి: ప్రధాని మోదీ నాయకత్వంలో మూడోసారి జాతీయ స్థాయిలో ఎన్డీఏ కూటమి విజయ బావుటా ఎగురవేయడంపై బీజేపీ శ్రేణులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సఖినేటిపల్లిలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది చరిత్రాత్మకమైన విజయం అన్నారు. వారణాసి నుంచి మూడో సారి లోక్‌సభకు ఎన్నికైన మోదీ సారథ్యంలో భారతదేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. 1971 తరువాత లోక్‌సభ ఎన్నికల్లో మరే ఇతర పార్టీ గాని, కూటమి గాని వరుసగా మూడు పర్యాయాలు విజయం సొంతం చేసుకున్న దాఖలాలు లేవన్నారు. అలాగే రాష్ట్రంలో కూడా ఎన్డీఏ కూటమి విజయం సాధించడంపై నగేష్ హర్షం తెలిపారు. రాష్ట్ర కిసాన్ మోర్చా డైయినేజ్ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామ కృష్ణంరాజు, మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, నాయకులు పోతురాజు సురేష్, కొంఠం శ్రీనివాసరావు, జీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తపేటలో బండారు విజయం


కొత్తపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారు సత్యానందరావుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆర్వో సత్యనారాయణ

- సమీప ప్రత్యర్థి చిర్ల జగ్గిరెడ్డిపై 56479 ఓట్ల మెజార్టీతో గెలుపు
- డిపాజిట్లు కోల్పోయిన మిగతా 11 మంది అభ్యర్థులు

కొత్తపేట: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా బండారు సత్యానందరావుతో పాటు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులతో మొత్తం 13 మంది పోటీలో ఉన్నప్పటికీ చిర్ల, బండారు మధ్యే జరిగిన పోరులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిపై 56,479 ఓట్లతో టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు విజయం సాధించారు. ముమ్మిడివరం సమీపాన చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో కలెక్టర్ హిమాన్షుశుక్లా పర్యవేక్షణలో కొత్తపేట ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్‌ఓ) జీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా రావులపాలెం, కొత్తపేట మండలాల ఓట్ల లెక్కింపు అనంతరం చివరగా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద ముగిసింది. మొదటి రౌండు నుంచీ బండారు ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,52,383 మంది కాగా గత నెల 13 న జరిగిన పోలింగ్‌లో మొత్తం 2,14,975 (85.18 శాతం) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్న విషయం తెలిసిందే. వాటిలో ఈవీఎంల ద్వారా బండారుకు 1,32,951 ఓట్లు రాగా జగ్గిరెడ్డికి 77,098 ఓట్లు లభించాయి. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈశ్వరరావు రౌతుకు 1146 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి కాండ్రు వెంకటేశ్వరరావుకు 585 ఓట్లు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి అరుణకిరణ్ సత్యాలకు 429 ఓట్లు, లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థి దడాల చంద్రరావుకు 130 ఓట్లు, నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థి బండారు శ్రీనివాసరావుకు 92 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులు బచ్చు శ్రీనివాసరావుకు 685, మెర్ల శాస్త్రులుకు 69, రాయుడు రాజుకు 194, సలాది వీవీడీఎస్ మూర్తికి 194, అంబర్కాన సుధాకర్‌కు 244, సుంకర లక్ష్మీమణికుమారికి 145 ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్స్ బండారుకు 1,335 ఓట్లు రాగా, జగ్గిరెడ్డికి 709 ఓట్లు లభించాయి. బండారుకు 626 ఓట్ల ఆధిక్యత లభించింది. బండారుకు మొత్తం 1,34,286 ఓట్లు, జగ్గిరెడ్డికి 77,807 పడ్డాయి. 56,479 ఓట్ల మెజార్టీతో బండారు ఘన విజయం సాధించారు.

పి.గన్నవరంలో గిడ్డికి పట్టం


పి.గన్నవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన గిడ్డి సత్యనారాయణకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆర్వో సోమసుందరరెడ్డి

మామిడికుదురు: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి తరఫున పోటీ చేసిన జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ 33,367 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆయనకు మొత్తం 96,108 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావుకు 62,741 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు కేవలం 1583 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆయన తన డిపాజిట్‌ను కోల్పోయారు. నోటాకు 1751 ఓట్లు రాగా నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా రాకపోవడం విశేషం. బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన కొల్లాబత్తుల సత్యనారాయణకు 1,819 ఓట్లు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు 939 ఓట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పోటీ చేసిన ఖండవల్లి సురేంద్రకు 720 ఓట్లు, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి కోట బాలకృష్ణకు 442 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి నాగాబత్తుల హేమంత్‌కుమార్‌కు 419 ఓట్లు, జైభీమ్ రావు భారత్ పార్టీ అభ్యర్థి దుక్కిపాటి విజయచంద్రకు 380 ఓట్లు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు 321 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి మాకే దేవీప్రసాద్‌కు 299 ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి కొల్లాబత్తుల ఆనందరావుకు 234 ఓట్లు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నక్కా శేఖర్‌కు 233 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి గన్నవరపు చంద్రఆనంద్‌కు 213 ఓట్లు లభించాయి. పి.గన్నవరం నియోజకవర్గం నుంచి మొత్తం 14 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. కాట్రేనికోన మండలంలోని చెయ్యేరు శ్రీశ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కించారు. అనంతరం ఈవీఎంలలో ఓట్లను లెక్కించారు.

రాజోలులో దేవను వరించిన గెలుపు


రాజోలు ఎమ్మెల్యేగా ఎన్నికైన దేవ వరప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

మలికిపురం: ఉత్కంఠ భరితంగా సాగిన రాజోలు అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి దేవ వర ప్రసాదరావు 38,241 ఓట్లతో విజయం సాధించారు. చెయ్యేరు శ్రీనివాసా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లో ఆయన మెజారిటీ సాధించారు. దేవ వరప్రసాద్ (జనసేన)కు 93,420 ఓట్లు, గొల్లపల్లి సూర్యారావు (వైసీపీ) 55,488 ఓట్లు రాగా సరెళ్ల ప్రసన్న కుమార్ (కాంగ్రెస్) 1398 ఓట్లు, పులపకూర లిలిని ఆశారాణి (బీఎస్పీ) 1062 ఓట్లు, మత్తి జయప్రకాశ్ (స్వతంత్ర) 811 ఓట్లు, యార్లగడ్డ క్రిష్ణ (పిరమిడ్ పార్టీ) 750 ఓట్లు, బొడ్డపల్లి నాగేశ్వరరావు (స్వతంత్ర) 352, మానుకొండ వెంకటప్రసాద్ (జాతీయ జనసేన పార్టీ) 316 ఓట్లు, పోతుమూడి అలివేలు మంగతాయారు (స్వతంత్ర) 273 ఓట్లు, కొండేటి ప్రభాకర్ రెడ్డి (స్వతంత్ర) 142 ఓట్లు, నోటా 1601 దక్కించుకున్నారు. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో 840 ఓట్లతో గెలిచిన జనసేన ఈ సారి భారీ మెజారిటీ సాధించింది.

నిర్మానుష్యంగా మారిన రహదారులు


నిర్మానుష్యంగా ఉన్న పుల్లేటికుర్రు ప్రధాన రహదారి

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని అంబాజీపేట మండలంలోని ప్రధాన రహదారులన్నీ మంగళవారం ఉదయం నుంచి నిర్మానుష్యంగా మారాయి. ఎన్నికల ఫలితాలు తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద టీవీలకు అతుక్కుపోయారు. ఉదయం దుకాణాలు తెరచినప్పటికీ, మధ్యాహ్న సమయంలో చాలా వరకు దుకాణాలను బంద్ చేశారు. దీనికి తోడు ఎండ తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు వచ్చే సాహసం చేయలేదు. రోడ్లపై ర్యాలీలు చేయకుండా పోలీసులు అడ్డుకుని నివారించారు. నిత్యం రద్దీగా ఉండే అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్, పుల్లేటికుర్రు, ముక్కామల, మాచవరం ప్రధాన రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. సాయంత్ర సమయంలో అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు ఎవ్వరూ బయటకు రాలేదు.

పాఠశాలల్లో నిరుపయోగంగా కంప్యూటర్లు


అంబాజీపేటలో శిథిలమై మూలకు చేరిన కంప్యూటర్లు

అంబాజీపేట: శాస్త్ర సాంకేతిక ఉరకలు వేస్తున్న ప్రస్తుత తరుణంలో గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందకుండా పోతుంది. గత ఏడేళ్లుగా కంప్యూటర్ విద్య విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. కంప్యూటర్ విద్య ఈ ఏడాదైనా ప్రారంభిస్తారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతో కోనసీమ జిల్లా వ్యాప్తంగా సుమారు 100 పాఠశాలల్లో సర్వశిక్షాభియాన్ నిధులతో ప్రారంభమైన కంప్యూటర్ బోధన అనంతరం 1000 పాఠశాలల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందేది. అనంతరం నిట్ సంస్థతో 2007లో ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం 2008 విద్యా సంవత్సరం నుంచి పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని సుమారు 90 పాఠశాలల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించే ఏర్పాటు చేశారు. దీని నిమిత్తం కాంట్రాక్ట్ పద్ధతిలో టీచర్లను నియమించి ఒక్కో టీచర్‌కు రూ.2,300ల చొప్పున జీతం ఇచ్చేవారు. అయితే కంప్యూటర్ ఉపాధ్యాయుల ఒప్పందం 2013తో ముగియడంతో విద్యార్థులకు నాటి నుంచి విద్య అందడం లేదు. కంప్యూటర్ల అనుమతి కాలం గడచిపోవడంతో ఆ సంస్థ వారు కంప్యూటర్లను మెయింటెనెన్స్ చేయకపోవడంతో అవి అలంకార ప్రాయంగా మారాయి. దీంతో కంప్యూటర్ విద్య కాస్తా అటకెక్కింది. లక్షలాది రూపాయలు వ్యయంతో పాఠశాలలకు అందజేసిన కంప్యూటర్‌లు ఎందుకూ పనికి రాకుండా పోవడంతో ఒక చోట భద్రపరిచారు. ఈ ఏడాది అయిన కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి 'పాలిక' మృతి


పాలిక శ్రీనివాసబాబు

రాజోలు: రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి పాలిక శ్రీనివాసబాబు (64) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చింతలపల్లి గ్రామానికి చెందిన పాలిక శ్రీనివాసబాబు రాజోలు మండలంలోని తాటిపాక, శివకోడు, చింతలపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల ఆయన రాజోలులో ఫోర్‌షోస్ థియేటర్‌ను నిర్మించారు. కొన్నేళ్ల పాటు ఆయన ఉదయం, వార్త తదితర ప్రముఖ పత్రికల్లో జర్నలిస్టుగా పని చేసి అనేక సామాజిక సమస్యలపై పోరాటం చేశారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం

- క్లస్టర్‌లో 28 వేల ఎకరాల్లో వరిసాగు
- అందుబాటులో 12.28 మెట్రిక్ టన్నుల ఎరువులు
- ఆర్బీకేల ద్వారా రైతన్నల చెంతకే విత్తనాల సరఫరా
- విరివిగా మట్టి నమూనాల సేకరణ


పెనికేరులో మినీ ట్రాక్టర్‌తో ఖరీఫ్ సీజన్‌లో దమ్ము చేస్తున్న రైతు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యలతో అధిక దిగుబడులను సాధించడం ద్వారా రబీ సీజన్ ఆశాజనకంగా ముగిసింది. గత ఏడాది పంటకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాలో జమ చేసి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. గ్రామాల్లో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరైన సమయానికి విత్తనాలు, ఎరువులు సరఫరా సక్రమంగా జరుగుతుంది. రైతులు తాము పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభ్యమవుతుంది. దీంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సమయాత్తమవుతున్నారు. నైరుతి రుతుపవనాలు పక్షం రోజులకు ముందే రావడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సాగులో విత్తన దశ నుంచి కోత కోసి మాసూళ్లు జరిగి ఆర్బీకేలకు విక్రయించే వరకూ ప్రతి అంశంలోను రైతులకు చేదోడు వాదోడుగా ఉంటూ గిట్టుబాటు ధర సాధించేందుకు వ్యవసాయశాఖ పక్కా ప్రణాళికలను రూపొందించింది. అధిక దిగుబడులు సాధించే వీలుగా రైతులను ప్రోత్సహించే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోనున్న 11 మండలాల్లో సుమారు 28 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. ఈ సాగులో 73 శాతం మేర స్వర్ణ రకం సాగు చేస్తుండగా ఎంటీయూ 1318 రకాన్ని 21 శాతం, ఎంటీయూ 1064 రకం ఆరు శాతం మంది సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ ఖరీఫ్ సాగులో ఎనిమిది వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేయగా రైతుల నుంచి సుమారు మూడు వేల క్వింటాళ్ల సేకరణ ఇప్పటికే జరిగింది. అలాగే ప్రస్తుతం వివిధ గ్రామాల్లో 900 క్వింటాళ్ల విత్తనాలు ఆర్బీకేల్లో నిల్వచేయగా మిగిలిన విత్తనాలు ఈ నెలాఖరులోగా సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. అలాగే ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎరువులు ఇప్పటికే ఆర్బీకేలకు చేరాయి.

ఖరీఫ్ సీజన్‌కు ముందు సాగునీటి సరఫరా

జిల్లాలోని రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే సాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురివడంతో పాటు జూన్ ఒకటి నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సెంట్రల్, తూర్పు,, పశ్చిమ డెల్టా కాలువలకు సాగునీరు అందిస్తున్నారు. అలాగే ఖరీఫ్ సాగు చేపట్టే ముందుగా రైతులందరూ మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం వ్యవసాయశాఖ తప్పసరి చేసింది. అందులో భాగంగా స్థానిక రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రైతులు తమ పొలాల్లోని మట్టి నమూనాలను సేకరించి ఇస్తే సంబంధిత రైతులకు త్వరితగతిన ఫలితాలను అందజేస్తారు. దీందో ఆ మట్టి నమూనాలో వచ్చే పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా నాణ్యమైన పంటలు పండించడంతో పాటు అధిక దిగుబడి, పెట్టుబడి ఆదా సమకూరే అవకాశం రైతులకు ఉంది.

సార్వాకు సిద్ధం చేశాం



సార్వా సాగును ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించేదుకు అన్ని విధాలుగా సంరక్షణ చర్యలు చేపట్టాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు తదితర విభాగాలను సిద్ధం చేశాం. రైతులకు ఎల్లప్పుడు సూచనలు, సలహాలను అందించేందుకు ఆర్బీకేల సిబ్బంది తగిన శిక్షణను ఇప్పటికే అందించాం.

– కె.నాగేశ్వరరావు, ఏడీఏ, ఆలమూరు

ఆర్‌బీకేలతో రైతులకు మేలు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. విత్తనాల సరఫరా నుంచి రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించే వరకూ అండగా ఉంటుంది. గతంలో మాదిరిగా కాకుండా ఎరువులు గ్రామంలోనే లభిస్తున్నాయి. దీనివల్ల నాణ్యమైన పంటలు పండించగలుగుతున్నాం.

– బొర్రా నాగరాజు, సంధిపూడి

ఆహారం... ఆరోగ్యం


జి.అగ్రహారంలో పోషణ్ పక్వాడా కిట్లను గర్భిణులకు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్ (ఫైల్)

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో భరోసా
- లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ

అంబాజీపేట: అందరికీ ఆరోగ్యం... అదే మహాభాగ్యం... తద్వారా ఇంటింటి సౌభాగ్యం.. అందుకే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తోంది. కొన్నేళ్ల క్రిందట గర్భిణులు, బాలింతలు పోషకాహారం తినకపోవడంతో ఆరోగ్యపరంగా ఇబ్బంది పడేవారు. ప్రసవ సమయంలో, ప్రసవానంతరం రక్త హీనతతో మృతి చెందేవారు. పుట్టే బిడ్డకు కూడా సంపూర్ణ పోషణ అందక అనారోగ్యాలు ముసురుకునేవి. వారికి సరైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించే వారు కాదు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, పోషణ్ పక్వాడా పథకాలు ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ప్రసవానంతరం ఆరు నెలల వరకు నెలవారీ ఆరు రకాల పౌష్టికాహార పదార్థాలతో కిట్లు అందిస్తున్నారు. వీటితో పాటు, పోషక విలువలతో కూడిన భోజనాన్ని మధ్యాహ్నం అందిస్తున్నారు. భోజనానికి రాని వారికి రోజుకో గుడ్డు, వారానికి లీటరు పాలు సరఫరా చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతోందని వైద్యులు చెబుతున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాలకు సంబంధించి 711 అంగన్‌వాడీ కేంద్రాల్లో 9,826 మంది చిన్నారులు, 6040 మంది గర్భిణులు, 5,890 మంది బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్ ఇలా..

ఈ కిట్‌లో కేజీ రాగి (చోడి) పిండి, కేజీ చిరుధాన్యాల పిండి, కేజీ అటుకులు, పావుకేజీ శనగ చిక్కి, పావుకేజీ బెల్లం, పావుకేజీ ఎండు ఖర్జూరం మొత్తంగా ఆరు రకాల ఆహార పదార్థాలు ఉంటాయి. వీటి ఉపయోగాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లను బాలింతలు, గర్భిణులకు వివరిస్తున్నారు. పౌష్టికాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వారిని చైతన్య పరుస్తున్నారు.

ప్రతి ఒక్కరూ వినియోగిస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణాహార కిట్లు ఇస్తున్నాం. పౌష్టికాహారంపై అవగాహనలో భాగంగా సుమారు నెల రోజుల పాటు పోషణ పక్వాడా పేరుతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన కల్పించాం. ప్రతి ఒక్కరూ ఈ కిట్లను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– వీఎస్‌వీ మహాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంబాజీపేట

దారుల వెంట విరుల పంట


భీమనపల్లిలో రోడ్డు చెంతన విరబూసిన తురాయి పూలు

ఉప్పలగుప్తం: మండలంలోని పలు రహదారుల వెంట తురాయి చెట్ల పూలు చెట్టంతా వికసించి పరవశింపజేస్తున్నాయి. ఆకులు కనపడకుండా ఎర్రటి సింధూర వర్ణంతో చెట్టంతా పూలు విరబూసి వికసించడంతో ప్రయాణికులకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. మండువేసవిలో భానుడి నుంచి రక్షిస్తూ ప్రయాణికులకు నీడనిచ్చి సేద తీరుస్తున్నాయి.